నమస్తే తెలంగాణ
కామారెడ్డి
5 | నిజామాబాద్, మంగళవారం 2 జనవరి 2024 | KAMAREDDY



జిల్లా పోలీసులకు సేవా పథకాలు

నిజామాబాద్‌క్రైం, జనవరి 1: జిల్లా పోలీసులకు ఉత్తమ సేవా పథకాలు లభించాయి. విధుల్లో సత్తా చాటిన పోలీసులను ప్రభుత్వం ఏటా వివిధ పథకాలతో సత్కరిస్తుంటుంది. ఈ క్రమంలోనే ఈసారి కూడా పలువురికి సేవా పథకాలు ప్రకటిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. డిచ్‌పల్లిలోని ఏడో బెటాలియన్ అడిషనల్ కమాండెంట్ పి.సత్యనారాయణ మహోన్నత సేవా పథకానికి ఎంపికయ్యారు. అలాగే, ఉత్తమ సేవా పథకానికి నిజామాబాద్ అడిషనల్ డీసీపీ ఎస్. జయరామ్, ఏడో బెటాలియన్‌కు చెందిన ఏఆర్ ఎస్సై జి.లక్ష్మారెడ్డి ఎంపికయ్యారు. ఇక, సీటీసీ ఏసీపీ సుబ్రమణ్యం శ్రావణ్‌కుమార్, ట్రాఫిక్ ఏసీపీ నారాయణ, సీఐ, ఎం.వెంకటసురేందర్‌రెడ్డి, సీటీసీ ఎస్సై ఆత్రం దేవ్‌రావు, సీఎస్‌బీ ఎస్సై కే.విఠల్. రూరల్ ఎస్సై జాదవ్ రామారావు, పోలీస్ పీసీటీ ఎస్సై డి.మహేందర్, బోధన్ టౌన్ ఎస్సై సీహెచ్.రామారావు, వీఆర్‌లో ఉన్న ఎస్సై గొల్ల ఎల్లయ్య, హెడ్‌క్వార్టర్స్ ఏఆర్ ఎస్సై హెచ్.నాగేశ్వర్, ఏర్గట్ల ఏఎస్సై సయ్యద్ ఇస్మాయిల్, వివిధ విభాగాలకు చెందిన హెడ్ కానిస్టేబుళ్లు వెంకటరమణ, జనార్దనరావు, రమణారెడ్డి, లక్ష్మణ్, అరుణకుమారి, రాములు, కానిస్టేబుళ్లు సతీష్, ఉషాశేఖర్‌లను ప్రభుత్వం సేవా పథకాలకు ఎంపిక చేసింది.

'ఫుల్లు'గా తాగేశారు

'న్యూఇయర్'కు భారీగా మద్యం విక్రయాలు

మత్తులో మునిగిపోయిన యువత
రెండ్రోజుల్లో మొత్తం రూ.22.68 కోట్ల వ్యాపారం
లిక్కర్ కంటే బీర్ల విక్రయాలే అధికం
సర్కారుకు దండిగా సమకూరిన ఆదాయం

మాక్లూర్, జనవరి 1: కొత్త సంవత్సర వేడుకలు ఏమో కానీ.. మద్యం వ్యాపారం జోరుగా సాగింది. రెండు రోజుల్లోనే రూ.22.68 కోట్ల మందు అమ్ముడు పోయింది. న్యూ ఇయర్ సెలబ్రేషన్స్ పేరిట యువత 'ఫుల్లు'గా లాగించేశారు. వేలాది సీసాలను ఖాళీ చేసి పడేశారు. ఓవైపు యువత మత్తులో జోగితే, మరోవైపు సర్కారుకు దండిగా ఆదాయం సమకూరింది. శని, ఆదివారాల్లో కలిపి రెండ్రోజుల్లోనే లిక్కర్, బీర్ కలిపి 41,663 కేసులు అమ్ముడు పోయాయి.

జోరుగా విక్రయాలు..

ఉమ్మడి జిల్లాలో మొత్తం 151 వైన్ దుకాణాలు ఉన్నాయి. నిజామాబాద్ జిల్లాలో 102, కామారెడ్డి జిల్లాలోని 49 వైన్స్ షాపులు ఉండగా, వీటికి మాక్లూర్ మండలంలోని మాదాపూర్‌లో గల ఐఎంఎల్ డిపో నుంచి మద్యం సరఫరా అవుతుంది. ప్రతి సంవత్సరం లాగే ఈసారి కూడా న్యూఇయర్ సందర్భంగా భారీగా మందు అమ్ముడు పోయింది. కేవలం రెండు రోజుల వ్యవధిలోనే సుమారు రూ.23 కోట్ల మద్యం వ్యాపారం జరిగింది. డిసెంబర్ 30వ తేదీన రూ.13.80 కోట్ల విలువ చేసే 12,371 లిక్కర్ కేసులు, 14,556 బీర్ కేసులను ఐఎంఎల్ డిపో నుంచి షాపులకు సరఫరా చేసినట్లు మాక్లూర్ ఎక్సైజ్ ఎస్సై సుదర్శనం తెలిపారు. ఇక, డిసెంబర్ 31న 7,984 లిక్కర్, 6,722 బీర్ కేసులు అమ్ముడు పోయాయి. వీటి ద్వారా ప్రభుత్వానికి రూ.8.88 కోట్ల ఆదాయం సమకూరింది. ఈసారి బీర్లతో పాటు లిక్కర్ విక్రయాలు కూడా ఎక్కువగా జరగడం గమనార్హం.

అర్ధరాత్రి తాగా హంగామా..

న్యూఇయర్ సంబురాల్లో యువత ఉత్సాహంగా పాల్గొన్నారు. రెండ్రోజుల ముందు నుంచే వేడుకలకు ఏర్పాట్లు చేసుకున్నారు. ఆదివారం ఉదయం నుంచే మద్యం, మాంసం కొనుగోలు చేసి వేడుకల్లో మునిగి తేలారు. డిసెంబర్ 31.. ఆదివారం కలిసి రావడంతో మద్యం, మాంసం వ్యాపారాలు జోరుగా సాగాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా యువకులు పొద్దంతా పార్టీల్లో మునిగి తేలారు. పెద్దలు సైతం నూతన సంవత్సర వేడుకల్లో భాగస్వాములయ్యారు. మందు తాగుతూ, డీజేలు పెట్టుకుని డ్యాన్సులు చేస్తూ యువకులు అర్ధరాత్రి వరకూ సాగిన సంబురాల్లో మునిగి తేలారు.

ఏడాదంతా బాగుండాలని..

వెల్లివిరిసిన ఆధ్యాత్మికత
కిటకిటలాడిన ఆలయాలు, చర్చిలు

నూతన సంవత్సరం ప్రారంభాన్ని పురస్కరించుకొని సోమవారం ఆలయాలు భక్తులతో సందడిగా మారాయి. ఏడాదంతా సుఖశాంతులతో ఉంచాలని కోరుతూ ప్రత్యేక పూజలు చేశారు. నిజామాబాద్ నగరంలోని ఉత్తర తిరుపతి, నీలకంఠేశ్వరాలయం, శంభునిగుడి, జెండా బాలాజీ మందిరం తదితర ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. క్రైస్తవులు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కేక్ కట్ చేసి కొత్త సంవత్సరానికి స్వాగతం పలికారు.

–నిజామాబాద్ కల్చరల్, జనవరి 1

జనమంతా.. ఉరుకులు.. పరుగులు

కిటకిటలాడుతున్న మీసేవ, ఆధార్ నమోదు కేంద్రాలు
ఆరు గ్యారెంటీలకు ఆధార్ అవస్థలు
ఆదాయ, కులధ్రువీకరణ పత్రాల కోసం అగచాట్లు
అప్‌డేట్ లేకపోతే పథకాలు రావేమోననే అపోహ

రాష్ట్ర ప్రభుత్వం అభయహస్తం ఆరు గ్యారెంటీల అమలుకు చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమంతో జనాలు మీ సేవా, ఆధార్ కేంద్రాలకు పరుగులు తీస్తున్నారు. ఆరు గ్యారెంటీల అమలుకు ఆధార్ కీలకంగా మారింది. గతంలో ఎప్పుడో తీసుకున్న ఆధార్ కార్డులు కావడం, ఆ తర్వాత వాటిని అప్‌డేట్ చేయకపోవడంతో చాలా మంది అప్‌డేట్‌తోపాటు మార్పులు, చేర్పులు కోసం ఆధార్ కేంద్రాల వద్ద బారులు తీరుతున్నారు. ముమ్మందు మరిన్ని సర్టిఫికెట్లు అవసరమవుతాయేమోనని ఇప్పటి నుంచే జనం మీ సేవా కేంద్రాలకు ఉరుకులు పరుగులు పెడుతున్నారు.

నగరంలోని ఓ ఆధార్ సెంటర్ వద్ద బారులు తీరిన జనం

ఖలీల్‌వాడి/ రాజంపేట్, జనవరి 1: రాష్ట్ర ప్రభుత్వం డిసెంబర్ 28 నుంచి ప్రజాపాలన అమలుకు దరఖాస్తులను స్వీకరిస్తున్నది. దరఖాస్తు స్వీకరణ కౌంటర్ల వద్ద కన్నా ఆధార్ కేంద్రాల వద్దనే జనం ఎక్కువగా కనిపిస్తున్నారు. ఆధార్‌లో మార్పులు, చేర్పుల కోసం ఒక్కసారిగా జనం క్యూ కట్టడంతో ఆధార్ సెంటర్ల సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఆధార్ నంబరే కీలకం..

మహాలక్ష్మీ పథకంలో భాగంగా మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించిన రాష్ట్ర ప్రభుత్వం, మహిళలకు ప్రతి నెలా రూ.2500, అలాగే రూ.500కే గ్యాస్ సిలిండర్, రైతు భరోసా పథకం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇండ్లు, చేయూత పథకాల అమలుకు ప్రజాపాలన కార్యక్రమంలో తీసుకునే దరఖాస్తులో కచ్చితంగా ఆధార్ కార్డు నంబరే కీలకంగా మారింది. తప్పనిసరిగా ఆధార్ నంబరు నమోదు చేయాల్సి ఉన్నది.

ఇప్పటికీ పాత జిల్లా...ఆంధ్రప్రదేశ్ రాష్ట్రమే..

2014లో పది జిల్లాలతో తెలంగాణ రాష్ట్రం ఏర్పడింది. 2016లో జిల్లాల పునర్విభజనకు శ్రీకారం చుట్టి 2019 వరకు మొత్తంగా 33 జిల్లాలను ఏర్పాటు చేసింది. కొత్త మండలాలూ ఏర్పడ్డాయి. రాష్ట్రంలో కొత్త జిల్లాలు, మండలాలు, గ్రామ పంచాయతీలు ఏర్పడి ఏండ్లు గడిచినా ఆధార్‌లో కొత్త అడ్రస్‌ను అప్‌డేట్ చేసుకోలేదు. ఇప్పటికీ చాలామంది ఆధార్ కార్డులపై పాత అడ్రస్‌లే ఉన్నాయి. ఈ కొత్త అడ్రస్‌ల మార్పిడి ఈ ఆరు గ్యారెంటీలకు అడ్డంకి కాకపోయినా కొత్తగా పెండ్లి చేసుకొని అత్తవారింటికి వచ్చి ఏండ్లు గడిచినా, అడ్రస్ మార్చుకోకపోవడం ద్వారా అత్తగారింటి వద్ద ఈ ఆరు గ్యారెంటీలకు దరఖాస్తు చేసుకోవడంలో ఇబ్బంది తలెత్తుతున్నది. అందుకే ఆధార్‌లో అడ్రస్ మార్చుకొని ఈ ఆరు గ్యారెంటీలకు దరఖాస్తు చేసుకోవాల్సి వస్తున్నది. ఈ నేపథ్యంలో ఆధార్ సెంటర్లకు వెళ్లే వారిలో కొత్తగా పెండ్లి అయిన వారే అధికంగా ఉండడం గమనార్హం.

రేషన్‌కార్డులో పిల్లలను చేర్చేందుకు..

రేషన్‌కార్డుల్లో పిల్లల పేర్లు చేర్చేందుకు ఆధార్ కీలకం కానున్నది. ఇన్నాళ్లూ పిల్లలకు ఆధార్ తీయని వారు సైతం ఇప్పుడు సెంటర్ల వద్దకు పరుగులు తీస్తున్నారు. ఐదారేండ్ల పిల్లలతో పాటు ఇటీవల జన్మించిన వారికి సైతం ఆధార్ తీసేందుకు బారులుతీరుతున్నారు. ఒక్కో సెంటర్ వద్ద రోజుకు కేవలం వందలోపు అప్లికేషన్లు మాత్రమే స్వీకరించేందుకు అవకాశముండగా, తెల్లవారేసరికి ఆధార్ కేంద్రాల వద్ద వందలాది మంది క్యూలో నిల్చుంటున్నారు.

ఆధార్ సెంటర్ లేక ఇబ్బందులు..

నూతన మండలంగా ఏర్పడిన కామారెడ్డి జిల్లా రాజంపేట మండలంలో ఇప్పటి వరకు ఆధార్ సెంటర్ లేకపోవడంతో మండల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రెండేండ్ల క్రితం మీసేవా నిర్వాహకుడికి ఆధార్ సెంటర్ మంజూరు చేయగా అందుకు సంబంధించిన ఏర్పాట్లు కూడా పూర్తయ్యాయి. కానీ యూఐడీఏఐ విధివిధానాలతో జాప్యం జరుగుతోందని నిర్వాహకులు తెలిపారు. త్వరితగతిన ఆధార్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఈ కేవైసీ కోసం గ్యాస్ ఏజెన్సీ వద్ద..

గ్యాస్ సిలిండర్ పథకం కోసం ఈ కేవైసీ అప్‌డేట్ చేసుకోవాలనే అపోహతో గ్యాస్ ఏజెన్సీల వద్ద జనం బారులుతీరుతున్నారు. రూ.500కే సిలిండర్ పథకానికి, ఈ-కేవైసీకి సంబంధం లేదని అధికారులు చెబుతున్నా...ఏజెన్సీల వద్ద క్యూలు తగ్గడం లేదు. ఈ-కేవైసీ చేయించుకోకపోతే పథకం లబ్ధి చేకూరదేమోననే ఆందోళనతో గ్యాస్ ఏజెన్సీలకు తరలుతున్నారు.

ఆదాయ, కులధ్రువీకరణ పత్రాలకు సైతం..

కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం అమలు చేయబోయే కొత్త పథకాలకు ఆదాయ, కుల ధృవీకరణ పత్రాల అవసరం ఉంటుందనే ఉద్దేశంతో వాటికి దరఖాస్తు చేసుకుంటున్నారు. ఇందుకు నిదర్శనమే.. వారం రోజుల నుంచి ఉమ్మడి జిల్లాలో ఆదాయ, కుల ధృవీకరణ పత్రాలకు వేలాదిగా దరఖాస్తులు వస్తున్నాయి. వచ్చిన దరఖాస్తుల విచారణకే సమయం కేటాయించాల్సి వస్తున్నదని, ఒక్కో రోజు నగరాల్లో 4వేల దరఖాస్తులు రాగా, మండలాల్లో సైతం ఇదే మాదిరి రద్దీ ఉంటున్నది. మీసేవా కేంద్రాలు తెరవక ముందే జనమంతా బారులు తీరుతున్నారు. అవసరమైతే అక్కడికే భోజనం తెచ్చుకొని మరి పని ముగిసే వరకు ఉంటుండడం గమనార్హం.

న్యూ ఇయర్ వేళ విషాదం..

డీజే విషయంలో గొడవ..

కాంగ్రెస్ పాట పెట్టిన కొందరు
బీఆర్ఎస్ పాట పెట్టాలన్న మరికొందరు
బీఆర్ఎస్ కార్యకర్తల దాడిలో కాంగ్రెస్ నేత మృతి
కామారెడ్డి జిల్లా నాచుపల్లిలో ఘటన

నస్రుల్లాబాద్, జనవరి 1: నూతన సంవత్సర వేడుకలు విషాదంగా మారాయి. గ్రామంలో జరిగిన దాడిలో ఓ వ్యక్తి మృత్యువాత పడ్డాడు. డీజే పాటల విషయంలో తలెత్తిన గొడవ హత్యకు దారి తీసింది. వివరాలు ఇలా ఉన్నాయి. కామారెడ్డి జిల్లా నస్రుల్లాబాద్ మండలం నాచుపల్లి గ్రామంలో ఆదివారం రాత్రి కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు సాదుల రాములు (45), గ్రామానికి చెందిన జెల్ల సాయికుమార్, గంపల సుధాకర్, మొండి భాస్కర్, కొప్పుల దివ్య తదితరులు కాంగ్రెస్ పార్టీకి చెందిన డీజే పాటలు పెట్టుకొని డ్యాన్సులు చేస్తున్నారు. అదే గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్తలు కీసరి రవి, కొంగల అనిల్, కొంగల గోపాల్, కొంగల వినోద్ వారి వద్దకు వెళ్లి బీఆర్ఎస్ పాటలు పెట్టాలని కోరారు. ఇది గమనించిన సాదుల రాములు, విఠల్, భూమయ్య, సాయిలు, హన్మాండ్లు, జెల్ల సాయికుమార్, గైని సాయిలు కలుగజేసుకుని వారిని అక్కడి నుంచి వెళ్లిపోవాలని కోరారు. దీంతో గోపాల్.. సాదుల రాములును దుర్భాషలాడుతూ చంపేస్తామని బెదిరిస్తూ వెనుదిరిగారు. కాసేపటికే రాములు ప్రైమరీ పాఠశాల వైపు నుంచి వెళ్తుండగా, అక్కడే ఉన్న కీసరి రవి, అనిల్, గోపాల్, వినోద్ ఒక్కసారిగా దాడి చేసి పిడి గుద్దులు కురిపించడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. నిందితులను కఠినంగా శిక్షించాలని కోరుతూ కుటుంబ సభ్యులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించకుండా అడ్డుకున్నారు. నిందితులకు చట్టపరంగా శిక్ష పడేలా చూస్తామని డీఎస్పీ జగన్నాథరెడ్డి హామీ ఇవ్వడంతో బాధితులు ఆందోళన విరమించారు. అనంతరం మృతదేహాన్ని పోలీసులు పోస్టుమార్టం కోసం తరలించారు.

మరోవైపు, గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నేత చలసాని సుధీర్ అండ చూసుకొని తన భర్తను హత్య చేశారని, అతడితో పాటు నిందితులపై చర్యలు తీసుకోవాలని మృతుడి భార్య సుజాత పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై లావణ్య తెలిపారు

స్నేహితుడి హత్య

భార్యతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడనే కోపంతో కత్తితో దాడి
మృతుడి కుటుంబ సభ్యుల ధర్నా

నిందితుడి ఇంటి ఎదుట రాకేశ్ కుటుంబ సభ్యుల ఆందోళన

రాకేశ్ (ఫైల్)

మోర్తాడ్, జనవరి 1 : స్నేహితుడినే పొడిచి చంపిన ఘటన నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండల కేంద్రంలో చోటు చేసుకున్నది. భార్యతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడనే కోపంతో కత్తితో పొడిచి చంపాడు. ఎస్సై అనిల్‌రెడ్డి తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. చెప్పాల రాకేశ్ (26), తెడ్డుసూర్య మంచి స్నేహితులు. తన భార్యతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడనే కోపంతో చెప్పాల రాకేశ్‌ను.. సూర్య కత్తితో పొడిచి హత్య చేశాడు.

మూడు నెలల క్రితమే గొడవ

తెడ్డుసూర్య గల్ఫ్ వెళ్లి దసరా సమయంలో మోర్తాడ్‌కు వచ్చాడు. వివాహేతర సంబంధం విషయమై మూడు నెలల క్రితమే ఇద్దరి మధ్య గొడవ జరిగింది. రాకేశ్ హైదరాబాద్‌లో డ్రైవింగ్ చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. క్రిస్మస్ సందర్భంగా ఇంటికి వచ్చాడు. గొడవ జరిగిన నాటి నుంచి కక్ష పెంచుకున్న సూర్య రాకేశ్‌ను ఎలాగైనా హతమార్చాలని నిర్ణయించుకున్నాడు. సోమవారం రాకేశ్ ఇంటి సమీపంలోని వాటర్‌ట్యాంకు వద్ద ఉండగా అదను చూసి కత్తితో పొడిచి చంపాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అనిల్‌రెడ్డి తెలిపారు.

సూర్య ఇంటి ఎదుట రాకేశ్ కుటుంబ సభ్యుల ఆందోళన

రాకేశ్ హత్యతో ఆగ్రహానికి గురైన కుటుంబ సభ్యులు సూర్య ఇంటి ఎదుట ధర్నాకు దిగారు. కోపంతో సూర్య ఇంటికి నిప్పంటించగా ఆర్పివేయడంతో ఎటువంటి ప్రమాదం జరగలేదు. సూర్యను తమకు అప్పగించాలని, అప్పటి వరకు ఆందోళన విరమించేది లేదని రాకేశ్ కుటుంబ సభ్యులు భీష్మించి కూర్చున్నారు. భీమ్‌గల్ సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై అనిల్‌రెడ్డి చట్టపరంగా కఠినంగా శిక్ష పడేలా చూస్తామని, సూర్య తమ అదుపులోనే ఉన్నాడని ఆందోళన విరమించాలని సముదాయించడంతో ఆందోళన విరమించారు.

కొకైన్ కలకలం..

ఇందల్వాయి వద్ద పట్టుకున్న పోలీసులు
ఢిల్లీ టూ హైదరాబాద్‌కు మాదక ద్రవ్యాలు
రూ.2లక్షల విలువైన కొకైన్, గంజా పౌడర్ సీజ్
ఇద్దరు నిందితుల అరెస్టు.. రిమాండ్‌కు తరలింపు

విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడిస్తున్న అదనపు డీసీపీ జయరాం

పట్టుబడ్డ కొకైన్,సెల్‌ఫోన్లు

నిజామాబాద్ క్రైం, జనవరి 1: నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని 44వ నంబర్ జాతీయ రహదారి మీదుగా కారులో తరలిస్తున్న మాదకద్రవ్యాలను పోలీసులు పట్టుకున్నారు. కమిషనరేట్‌లో అదనపు డీసీపీ జయరాం సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. డిసెంబర్ 31న నడిపల్లి తండా వద్ద టాస్క్ ఫోర్స్ ఏసీపీ రాజశేఖర్ రాజు, సిబ్బంది వాహనాల తనిఖీ చేపట్టారు. అదే సమయంలో స్కోడా కారులో అనుమానాస్పదంగా వెళ్తున్న వారిని ఆపి తనిఖీ చేశారు. కారులో ప్రయాణిస్తున్న ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలోని కోనసీమ జిల్లా (ప్రస్తుతం హైదరాబాద్‌లోని గచ్చిబౌలి)కు చెందిన ద్వారంపూడి విక్రమ్, పల్నాడు జిల్లా (ప్రస్తుతం హైదరాబాద్ మణికొండ)కు చెందిన షేక్ ఖాజా మొహినుద్దీన్ అనే ఇద్దరు మాదకద్రవ్యాలు తీసుకెళ్తున్నట్లు గుర్తించారు. కారు డ్యాష్ బోర్డులో 3ప్లాస్టిక్ కవర్లలో కోన్ ఆకారంలో ఉన్న ముక్క లభ్యం కాగా వాటిని క్లూస్‌టీమ్ పరిశీలించగా ఎండీఎంఏ అనే మత్తు పదార్థంగా గుర్తించారు. మరో కవర్‌లో తెల్లని ముద్ద కొకైన్ ఉన్నట్లు గుర్తించారు. కారు వెనుక భాగంలో మరో కవర్‌లో గంజాయి పౌడర్‌ను గుర్తించినట్లు అదనపు డీసీపీ వెల్లడించారు. ఎండీఎంఏ డ్రగ్ 3.2 గ్రాములు,కొకైన్ 12.3 గ్రాములు, గంజా పౌడర్ 3.1 గ్రాములు ఉంది. నిందితులను అదుపులోకి తీసుకొని విచారించగా ఢిల్లీకి చెందిన రాహుల్ అనే వ్యక్తి ద్వారా, మైక్ అనే వ్యక్తి నుంచి న్యూ ఇయర్ కోసం ఈ మత్తు పదార్థాలు తీసుకువస్తున్నట్లుగా అంగీకరించారని తెలిపారు. పట్టుబడిన మత్తు పదార్థాల విలువ రూ.2లక్షల వరకు ఉంటుందని పేర్కొన్నారు. కారుతో పాటు సెల్‌ఫోన్లను సీజ్ చేశామన్నారు. సమావేశంలో నిజామాబాద్ ఏసీపీ కిరణ్ కుమార్,టాస్క్‌ఫోర్స్ ఏసీపీ రాజశేఖర్ రాజు, ఇన్‌స్పెక్టర్లు అజయ్ బాబు,అంజయ్యతోపాటు డిచ్‌పల్లి సీఐ కృష్ణ, ఎస్సై మహేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

అర్ధరాత్రి యువకుల మధ్య గ్యాంగ్‌వార్

కర్రలు,రాడ్లతో పరస్పరం దాడులు
పలువురికి గాయాలు.. పోలీసులకు ఫిర్యాదు

నిజామాబాద్ క్రైం,జనవరి 1 : నిజామాబాద్ జిల్లా కేంద్రంలో న్యూఇయర్ వేడుకల సందర్భంగా యువకుల మధ్య ఘర్షణ చోటు చేసుకున్నది. ఆదివారం అర్ధరాత్రి అనంతరం రెండు గ్యాంగులకు చెందిన యువకులు ఒకరినొకరు దూషించుకోవడం ఘర్షణకు దారి తీసింది. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. నగరంలోని ఆర్యనగర్, ఇంద్రాపూర్ కాలనీ, వినాయక నగర్, కోటగల్లీ ప్రాంతాలకు చెందిన సుమారు 40 మంది యువకులు గొడవకు దిగారు. ముందుగా వినాయకనగర్ ప్రాంతంలో పరస్పరం దాడులు చేసుకున్న యువకులు అక్కడి నుంచి 100 ఫీట్ల రోడ్డు అనంతరం కోటగల్లీ ప్రాంతాల్లో రెండు గ్యాంగులకు చెందిన యువకులు కర్ర లు, రాడ్లతో కొట్టుకున్నారు. ఈ దాడుల్లో ముగ్గురికి గాయాలయ్యాయి. సోమవారం రోజు ఓ గ్యాంగ్‌కు చెందిన యువకులు సం బంధిత నాల్గోటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దాడుల్లో ఎవరెవరు ఉన్నారో గుర్తించేందుకు పోలీసులు సీసీ కెమెరాల పుటేజీలను పరిశీలించే పనిలో నిమగ్నమయ్యారు. త్వరలోనే దాడులు చేసుకున్న యువకులను గుర్తించి వారిపై కేసు నమోదు చేస్తామని పోలీసులు తెలిపారు.